నిరుపయోగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- పనిచేయని లిఫ్ట్, ఎస్కలేటర్
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- అపరిశుభ్రతతో తీవ్ర దుర్వాసన
- పట్టించుకోని అధికారులు

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేలాది వాహనాలు, పాదచారులతో పంజాగుట్ట చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంత రద్దీగా ఉన్నప్పటికీ ఇక్కడ మూడు సంవత్సరాల క్రితం ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్ఓబీ) నిరుపయోగంగా మారింది. వందలాది మంది వినియోగించుకుంటారు అనుకుంటే పట్టుమని పది మంది కూడా వినియోగించుకోవడం లేదు. కొంతకాలం నుంచి లిఫ్ట్, ఎస్కలేటర్ పనిచేయడం లేదు. దీంతో వృద్ధులు, మహిళలు మెట్లు ఎక్కలేకపోతున్నారు. ఎక్కేవారు, దిగేవారు లేకపోవడంతో బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. అయితే అధికారుల అనాలోచిత నిర్ణయంతోనే ఐదు కోట్ల రూపాయలతో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరం ఉన్న చోట కాకుండా చౌరస్తాలో ఏర్పాటు చేశారని పలువురు చెబుతున్నారు. పాదచారులు దీనిని వినియోగించుకోకపోవడంతో రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. అక్కడే మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వస్తోంది.

అవసరం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే మేలు

పంజాగుట్ట చౌరస్తా, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ఎఫ్ఓబీలు నిరుపయోగంగా మారాయి. కోట్ల రూపాయలతో నిర్మించిన వీటిని పదుల సంఖ్యలో మాత్రమే పాదచారులు వినియోగిస్తున్నారు. ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం, షాదన్ కళాశాల, చింతల బస్తీ బస్టాప్, విద్యుత్ సౌధ, ఎర్రమంజిల్ జలసౌధ, నిమ్స్ ఆస్పత్రి, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు ఎక్కువగా ఉన్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలు, జిల్లాలకు చెందిన వారు నిత్యం ఆయా ప్రాంతాలకు వస్తూ ఉంటారు. అలాంటి ప్రాంతాల్లో వేగంగా దూసుకొచ్చే వాహనాల మధ్యలో నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రహదారి దాటే పరిస్థితి ఉంటుంది. ఆ ప్రాంతాల్లో రోడ్డు దాటుతూ పలువురు తీవ్రంగా గాయపడగా, కొందరు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. అలాంటి ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పాదచారులు అంటున్నారు.



పంజాగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి



మూసివేసిన ఎస్కలేటర్ ద్వారం

ఎస్కలేటర్ ద్వారానికి తాళం వేశారు



ఫుట్ ఓవర్ బ్రిడ్జి అపరిశుభ్రంగా మారింది. మందుబాబులు, పాదచారులు రాత్రి వేళల్లో లిఫ్ట్ పక్కన, ఖాళీ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. లిఫ్ట్, ఎస్కలేటర్ పనిచేయడం లేదు. ఎస్కలేటర్ ఎక్కే ద్వారానికి తాళం వేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

- మురళీమోహన్ ముదిరాజ్, పంజాగుట్ట

అవసరం ఉన్నచోట ఏర్పాటు చేయాలి



అవసరం ఉన్న ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ఆస్పత్రులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి ప్రాంతాల్లో ఎఫ్ఓబీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- చిలకల వెంకటేశ్వరరావు, వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న విజయారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం

- మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంత్రుల నివాసంలో టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి మంగళవారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు రావాల్సిన వాటాను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

బోరబండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 పీజేఆర్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. బస్తీకి చెందిన కనకదుర్గ భవానీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేసవి ముగిసే వరకు చలివేంద్రం కొనసాగిస్తామని కమిటీ అధ్యక్షుడు యాదయ్య తెలిపారు. అనంతరం ఉగాది సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. శ్రీరామనవమి వరకు ప్రతి మంగళవారం అన్నదానం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ కోశాధికారి లంకా భరత్ ప్రసాద్, బి.చెన్నయ్య, డి.సుబ్బారెడ్డి, వేముల వెంకటేష్, వి.మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కంటి అద్దాలు తీసుకున్న విద్యార్థినులతో కార్పొరేటర్ దేదీప్య, వైద్యులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య శిబిరం

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జవహర్ నగర్‌లోని అమీర్‌పేట నంబర్-1 ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ విజయ నిర్మల, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, ఫార్మసిస్ట్ దివ్య, ఐశ్వర్య, ప్రధానోపాధ్యాయులు శాంత విద్యార్థులు పాల్గొన్నారు.


ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఇఫ్తార్‌కు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్‌కు వెళ్లి వచ్చే సరికి దుండగులు ఇంట్లో చోరీ చేశారు. విలువైన బంగారు ఆభరణాలు, స్వదేశీ, విదేశీ నగదు చోరీ చేశారు. షేక్‌పేట డైమండ్ హిల్ కాలనీకి చెందిన మహ్మద్ ముజాహిద్ కమల్ కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాలో ఉంటూ రెండు నెలల క్రితం తిరిగి వచ్చాడు. ఈ నెల 17న కుటుంబ సభ్యులతో కలిసి ఇఫ్తార్ కోసం బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున తిరిగి వచ్చే సరికి ఇంటి వెనకవైపు తలుపు పగులకొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. అల్మారాలో ఉన్న 34 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.5 లక్షల నగదు, 550 కెనడియన్ డాలర్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి పోలీసులు ఆధారాలను సేకరించారు.

కారు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం వద్ద కారును దొంగిలించిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట్ లీలానగర్‌కు చెందిన తోట ప్రసాద్ ఈ నెల 16న కారు రోడ్డుపై పెట్టి మద్యం దుకాణానికి వెళ్లాడు. ఈ సమయంలో అమీర్‌పేట్ లాల్‌బంగ్లా ప్రాంతంలో నివసించే మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన దిగబర్ రఘునాథ్ ఖండేరే(29) కారును తీసుకెళ్లాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు.

కానిస్టేబుల్‌నని నమ్మించి యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అమీర్‌పేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాను పోలీస్ కానిస్టేబుల్‌నని, ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నానని బీటెక్ చదివే యువతిని నమ్మించిన వ్యక్తి ఆమె ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లను తీసుకుని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. తాను చెప్పినట్లు వినకుంటే ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్ చేసి బంధువులకు పంపిస్తానని చెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన యువతి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువతి (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఏడాది క్రితం ఓ పార్క్‌కు వెళ్లినప్పుడు తేమలి పుజారా రమేష్(24) అనే యువకుడు పరిచయమయ్యాడు. తాను పోలీస్ కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత ఆమె ఫోన్‌లోని నంబర్లను తన ఫోన్‌లోకి మార్చుకుని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుంటే అతడు నిజంగానే కానిస్టేబుల్‌నేనా అనే విషయం తెలుస్తుందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేయాలి

వెంగళరావునగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లను గుర్తించేందుకు ఓటర్ కార్డులకు ఆధార్ నంబర్ లింక్ చేయాలని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అధికారులకు సూచించారు. మంగళవారం జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ 19 కార్యాలయంలో డీఎంసీ జకియా సుల్తానా అధ్యక్షతన ఎన్నికలకు సంబంధించిన ఆల్ పార్టీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ప్రధాన కార్యదర్శి జీవీజీ నాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను అందజేయాలని, ఒక్కో పోలింగ్ బూత్ లో 1200 మంది ఓటర్లు ఉండేలా చూడాలని, ఓటింగ్ శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకుడు టి.సాయి శేషగిరిరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుడు వినోద్ మాట్లాడుతూ.. ఓటర్ కార్డులకు ఆధార్ కార్డు లింక్ చేస్తే దొంగ ఓట్లను అరికట్టవచ్చన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా

దొంగ ఓట్లను తొలగించాలి

బేగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓటరు లిస్ట్‌లో తప్పులను సరిచేయడంతో పాటు దొంగ ఓట్లను తొలగించాలని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాపై పలు పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దొంగ ఓట్లను తొలగించేందుకు టెక్నాలజీని వినియోగించడంతో పాటు బీఎల్వోల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ధ్వంసమైన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్ సూర్యప్రకాశ్

తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం

వెంగళరావునగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని జలమండలి వెంగళరావునగర్ సెక్షన్ మేనేజర్ సూర్యప్రకాష్ పేర్కొన్నారు. తాగునీరు సక్రమంగా రావడం లేదని, జి-బ్లాక్‌లో సంపు నిర్మాణం కోసం గుంత తవ్వడంతో పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయని స్థానికులు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం మధురానగర్ జి, హెచ్ బ్లాక్‌లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం దెబ్బతిన్న పైప్‌లైన్‌లను ఆయన పరిశీలించారు. మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, హైప్రెజర్‌తో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎం.ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు యాదవ్ పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతోనే స్ట్రోక్ సమస్యలు

- హెచ్‌సీఏహెచ్ సదస్సులో వైద్యులు

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ధూమపానం, మద్యపానం, అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల యువత ఎక్కువగా స్ట్రోక్స్ బారిన పడుతున్నారని వైద్యులు వెల్లడించారు. స్ట్రోక్ వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని, లేదంటే శాశ్వత వైకల్యాలకు దారి తీస్తుందని వారు హెచ్చరించారు. హెల్త్ కేర్ ఎట్ హోమ్(హెచ్‌సీఏహెచ్) సంస్థ మంగళవారం సోమాజిగూడలో స్ట్రోక్ రికవరీలో ముందస్తు రీహాబిలిటేషన్ ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించింది. నగరంలో యువతలో స్ట్రోక్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని, స్ట్రోక్ వచ్చిన ప్రతి ఏడుగురిలో ఒకరు 25-45 సంవత్సరాల మధ్య వయస్సు గల వారే ఉంటున్నారని చెప్పారు. ఏఐ ఆధారిత పరికరాలతో న్యూరో రిహాబిలిటేషన్, ఫిజియోథెరపీ, అధునాతన స్ట్రోక్ రికవరీ పద్ధతుల్లో స్ట్రోక్ రోగులు కొంత ఉపశమనం పొందుతున్నారని వారు వెల్లడించారు. ఈ సదస్సులో హెచ్‌సీఏహెచ్ సహ వ్యవస్థాపకుడు, సీఓఓ డాక్టర్ గౌరవ్ తుక్రాల్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ చీఫ్ న్యూరోసర్జన్ డాక్టర్ నవీన్ మెహ్రోత్రా, న్యూరోసర్జన్ డాక్టర్ అనంత్ పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న వైద్యులు


సమావేశంలో మాట్లాడుతున్న కాటం నరసింహ యాదవ్

రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కుల సంఘాల ఐక్య వేదిక కృతజ్ఞతలు

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బేగంపేటలోని ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ప్రజాభవన్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. వృత్తి నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యుద్ధవీర్, రమేష్, వెంకటేష్ గౌడ్, మాలతి, రేణుక, వీరమణి, శ్రీదేవి, బి.రాకేష్, రాధ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన హ్యాండ్‌లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త అనన్య ఎ సిప్పై మంగళవారం ప్రారంభించారు. వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేతకారులతో మాట్లాడి వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 27 వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.


వస్త్ర ఉత్పత్తులతో సినీ నటి అనన్య ఎ సిప్పై

వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మించి మోసం

బోరబండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మేనియా దేశానికి వెళ్లేందుకు వర్క్ వీసాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లో టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ నిర్వహించే అవినాష్‌కు గత డిసెంబరులో నరేష్ అనే వ్యక్తి ద్వారా సయ్యద్ మదార్ పరిచయమయ్యాడు. తాను ఆర్మేనియా దేశంలో పని చేస్తున్నానని, ఆ దేశానికి వర్క్ వీసాలు ఇప్పించగలనని సయ్యద్ మదార్ నమ్మబలికాడు. తన క్లయింట్స్ 8 మందికి వర్క్ వీసాలు ఇప్పించాలని అవినాష్ కోరగా అందుకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున ఖర్చు అవుతుందని మదార్ చెప్పాడు. రూ.1.20 లక్షలను మదార్‌కు ట్రాన్స్ ఫర్ చేయడంతో ఆర్మేనియా వర్క్ వీసాలు అంటూ డాక్యుమెంట్లను వాట్సాప్ ఎలో పంపాడు. ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. దాంతో మదార్‌ను నిలదీయగా పొంతనలేని సమాధానాలిచ్చాడు. తీసుకున్న డబ్బు తిరిగివ్వమంటే తప్పించుకుని తిరగసాగాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో సత్తా చాటిన గీతాంజలి


గీతాంజలి

హైదరాబాద్ సిటీ, మార్చి18 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ వెల్లడించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ విభాగం ఫలితాల్లో నగరానికి చెందిన మాడగిరి గీతాంజలి రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు, జోనల్ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది. ఆమె ఎర్రమంజిల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. లాల్ బహదూర్ కాలేజ్‌లో ఇంటర్, శాంతినికేతన్‌లో డిగ్రీ, అలీ అవార్ జంగ్ బీఎడ్‌లో చదువుకుంది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదివి 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుని విధులు నిర్వహిస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఇటీవల రాసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో సత్తా చాటింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు,స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. గ్రూప్ వన్ ఆఫీసర్ కావడమే తన లక్ష్యమని గీతాంజలి పేర్కొంది.

వ్యక్తిపై కత్తితో దాడి

బేగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై బైక్‌పై వచ్చిన దుండగులు కత్తితో దాడి చేసి పరారయ్యారు. చేతికి గాయం కావడంతో బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగవంతాపూర్‌లో గల గగన్‌విహార్ కాలనీలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటలోని భగవంతాపూర్‌లో నివసించే వెంకటేష్‌యాదవ్(35) ట్రాలీ ఆటో నడుపుతుంటాడు. మంగళవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆటో పార్క్ చేసి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగుల్లో ఒకరు కత్తితో దాడి చేశాడు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. దాడికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి, దివ్య

ప్రజావాణికి 395 అర్జీలు

బేగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 395 అర్జీలు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 76, విద్యుత్ శాఖకు 30, రెవెన్యూకు 56, ఇందిరమ్మ ఇళ్లకు 145, ఇతర శాఖలకు 88 అర్జీలు వచ్చినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను చిన్నారెడ్డి ఆదేశించారు.


వైశ్య జాతిరత్న అవార్డు అందుకుంటున్న కటకం భాస్కర్

కటకం భాస్కర్‌కు వైశ్య జాతిరత్న అవార్డు

అమీర్‌పేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త కటకం భాస్కర్ వైశ్య జాతిరత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైశ్య సమాజం నుంచి ఈ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తాను ఎదుర్కొన్న సవాళ్లు, నేర్చుకున్న పాఠాలు తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయన్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

ఖాళీగా ఉన్న 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏసీఎస్ నగర్ హౌజింగ్ కాలనీ వాసులు

అడ్డగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డబుల్ బెడ్‌రూం హౌజింగ్ కాలనీ ముఖ్య సలహాదారుడు పెండం మనోహర్ ఆధ్వర్యంలో బస్తీవాసులు మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బస్తీలో మీడియా సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ.. నిరుపేద బస్తీగా పేరున్న ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో 2010లో హౌజింగ్ స్కీం కింద 192 మంది లబ్ధిదారులకు కేవలం పొజిషన్ సర్టిఫికెట్లను మాత్రమే పంపిణీ చేశారన్నారు. బస్తీలో అనుకున్నంత స్థలం లేకపోవడంతో 48 డబుల్ బెడ్‌రూంలను మాత్రమే నిర్మించి 44 మంది అర్హులైన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ల ద్వారా ఇళ్లను కేటాయించారని తెలిపారు. ఇంకా నాలుగు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, మిగితావారికి ఇప్పటి వరకు పొజిషన్ సర్టిఫికెట్లు కలిగి ఉన్న లబ్ధిదారులకు ఎక్కడా డబుల్ బెడ్‌రూంలు నిర్మించలేకపోయారని ఆయన తెలిపారు. గతంలో పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్న లబ్ధిదారులకు హైదరాబాద్‌లో ఎక్కడైనా సరే ఇళ్లు కేటాయించాలని హైదరాబాద్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, సికింద్రాబాద్ ఆర్డీఓలకు మెమోరాండం అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆజాద్ చంద్రశేకర్‌నగర్ బస్తీలో ఉన్న నాలుగు ఇళ్లు, మిగితా వారికి నగరంలో ఎక్కడైతే ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. బతుకు దేరువు కోసం వలసొచ్చిన నిరుపేదలకు ఇంత వరకు సొంత ఇళ్లు లేకపోవడతో అద్దె ఇళ్లల్లో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఖాళీగాఉన్న ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన వారికి పొజిషన్ సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారికి అవకాశం కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బస్తీవాసులు వేణ గోపాల్, కొండయ్య, బ్రహ్మయ్య, బాబు, స్వరూప, కోటేశ్వర్‌రావు, పరుషరాంలు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి



సదస్సులో పాల్గొన్న వక్తలు, విద్యార్థినులు

సికింద్రాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరిగే హింసను అరికట్టడానికి ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. 'వ్యక్తిగతంగా, పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న హింస, దానివల్ల మహిళలు పడుతున్న ఆవేదన' అనే అంశంపై ఆక్షన్ ఎయిడ్ కర్నాటక ప్రాజెక్ట్, సికింద్రాబాద్ పీజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో పీజీ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా పని చేసే సంస్థలు, కార్యాలయాల్లో పడుతున్న అవస్థలపై, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వక్తలు మాట్లాడారు. పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీధర్, ఇంగ్లిష్ విభాగం అధిపతి డాక్టర్ మృదుల లక్కరాజు, మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ అధికారిణి లక్ష్మీ తేజశ్విని, న్యాయవాది డాక్టర్ సువాసిని, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అసోసియేట్ డైరెక్టర్ దుర్గా కట్టా, ఆక్షన్ కర్నాటక ప్రాజెక్టు ప్రతినిధి వందన పాల్ బర్దర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎన్‌టీపీసీ అధికారులు

పద్మారావునగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం, కవాడిగుడా ప్రధాన దారిలోని ఎన్‌టీపీసీ దక్షిణ ప్రాంత కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కార్యక్రమంలో భాగంగా 675 మంది విద్యార్థులకు టీ శర్ట్‌లను అందజేశారు. కార్యక్రమానికి ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్)ఎస్ఎన్ పాణిగ్రహి, మేనేజర్ ప్రియాంక భుయాన్, అఖిల్ పట్నాయక్, మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు స్వరూప విద్యార్థులు వారి తల్లిదండ్రుల తరపున ఎన్‌టీపీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



హాస్టల్ విద్యార్థినులకు కళ్ల అద్దాలు పంపిణీ చేసిన వైద్యులు

అడ్డగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కంటిలోపం ఉన్న విద్యార్థినులు కంటి పరీక్షలు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అధికారిని జయశ్రీ విద్యార్థినులకు సూచించారు. మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం, గాంధీ ఆస్పత్రి వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో మహేంద్రాహిల్స్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కంటి (దృష్టి)లోపం ఉన్న బాలికలు వైద్య పరిక్షలు చేసుకోవాలని సూచించారు. వంద మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం డాక్టర్ వీరు, డాక్టర్ సరిత, మహేంద్రాహిల్స్ రెసిడెన్సియల్ ప్రిన్సిపల్ జి.సునితతో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

25 ఏళ్లుగా రూ. 15 వేలే

- 2017లో జీఓ 60 అమలు ..
- పెరగనీ జీతాలు
- గతేడాది సెప్టెంబరు 3న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వినతి



గతేడాది సెప్టెంబరు 3న గాంధీకి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు (ఫైల్)

అడ్డగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి ఆరోగ్యశ్రీ ఉద్యోగులంటే అంత చులకన. 25 ఏళ్లుగా పనిచేస్తున్నాం. జీతాలు పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆరోగ్య శ్రీ విభాగంలో 70 మంది వివిద వైద్య విభాగాల్లో పనిచేస్తున్నారు. 25 ఏళ్ల క్రితం నుంచి ఒక్కొక్కరికి రూ. 15 వేల జీతమే వస్తోందని, 2017లో జీఓ 60 ప్రకారం ఒక్కొక్కరికి రూ. 25 వేలు ఇవ్వాలని ప్రభుత్వం జీఓ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అదే రూ.15 వేల జీతంతోనే పనిచేస్తున్నామని వాపోతున్నారు. తమకు రూ. 25వేలు పెంచాలని మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు చాలా సార్లు విన్నవించుకున్నారు. గతంలో గాంధీ ఆస్పత్రికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ వైద్య శాఖ అధికారులకు జీతాలు పెంచాలని వినతి పత్రాలు సమర్పించినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల పది రోజుల క్రితం గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహను కలిస్తే ఈ విషయం తన దృష్టిలో ఉందని మాట దాటవేశారు. తెలంగాణలోని అన్ని జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు జీఓ 60ప్రకారం ఒక్కొక్కరికి రూ.25వేలు ఇస్తున్నారు. కానీ గాంధీలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు ఇంత వరకు జీతాలు పెంచలేకపోయారు. హైదరాబాద్‌లో ఉస్మానియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు కూడా జీతాలు పెరిగాయి. రూ. 15 వేల జీతంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నామని గాంధీ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాంధీ ఆస్పత్రి

జీతాలు చాలక ఉద్యోగుల రాజీనామా

గాంధీ ఆస్పత్రిలో గతంలో 90 మంది ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసిన ఉద్యోగులు 20 మంది 25 ఏళ్లుగా పని చేసిన తమకు జీతాలు పెరగలేదన్న కారణంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. కుటుంబ పోషనకు కష్టంగా మారడంతో ఉద్యోగులు హైరాన పడ్డారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు మూకుమ్మడిగా రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

21 నుంచి 'పది' పరీక్షలు

మారేడుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు కొనసాగుతాయని మారేడుపల్లి జోన్ డిప్యూటీ ఈఓ బాలు నాయక్ పేర్కొన్నారు. రెగ్యూలర్ పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ వరకు, ఒకేషనల్ పరీక్షలు నాలుగో తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మారేడుపల్లి మండలం, తిరుమలగిరి మండలం పరిధిలోని మొత్తం 120 పాఠశాలలకు సంబంధించి 5,064 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో బాలురు 2,450 మంది కాగా బాలికలు 2,614 మొత్తం పదో తరగతి పరీక్ష రాయడానికి 31 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందులో 14 ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ స్కూల్ 1, బీసీ వెల్ఫేర్ స్కూల్స్ 2, మైనార్టీ 1, ట్రైబల్ 1, ఎయిడెడ్ స్కూల్స్ 5 కాగా 96 ప్రైవేటు స్కూళ్ల విద్యార్థినీ విద్యార్థులు పరీక్ష సెంటర్లలో పదో తరగతి పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఈఓ బాలు నాయక్ చెప్పారు.

మధ్యవర్తులు వద్దు.. నేరుగా బుక్ చేసుకోండి

- కంటోన్మెంట్ నీటి విభాగం అధికారులు



బాలంరాయి పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ సీఈఓ పల్లవి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్

సికింద్రాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పౌరులు నేరుగా ఆన్‌లైన్‌లో వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకోవాలని, బుక్ చేసిన 24గంటల్లో ట్యాంకర్ పంపిస్తామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి, నీటి విభాగం సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసే సమయంలో దరఖాస్తుదారుడి సెల్‌నెంబర్ కూడా ఇవ్వాల్సి ఉంటుందని, ట్యాంకర్ డెలివరీ సమయంలో సెల్ నెంబర్ ద్వారా చెక్ చేస్తామని, మధ్యవర్తుల, దళారుల ప్రమేయం ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ప్యారడైజ్ సమీపంలోని పంప్‌హౌజ్‌ను మంగళవారం వారు సందర్శించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్న తీరుతెన్నులు పరిశీలించారు. ట్యాంకర్ల సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని, ట్యాంకర్లకు జీపీఎస్ కల్పిస్తున్నట్టు వారు ట్యాంకర్ డ్రైవర్లను హెచ్చరించారు. నీటి సరఫరాలో బ్రేక్‌డౌన్‌లు జరిగే సందర్భాల్లో మాత్రమే బస్తీలకు ఉచితంగా నీటి సరఫరా చేస్తామని వారు తెలిపారు.

ప్రజావాణికి 395 అర్జీలు

బేగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 395 అర్జీలు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 76, విద్యుత్ శాఖకు 30, రెవెన్యూకు 56, ఇందిరమ్మ ఇళ్లకు 145, ఇతర శాఖలకు 88 అర్జీలు వచ్చినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను చిన్నారెడ్డి ఆదేశించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మారేడుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈస్ట్ మారేడుపల్లి ప్రధాన రహదారిలోని గుర్తు తెలియని వృద్ధుడు(60) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గవనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆ వృద్ధుడు మృతి చెంది ఉన్నట్టు పోలీసులు తెలిపారు. చుట్టు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకునే వాడని పోలీసులు తెలిపారు.

బీసీల ప్రాధాన్యతను పెంచేలా కృషి



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులతో చైర్మన్ ఆనంద్ బాబు

బోయిన్‌పల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీసీల ప్రాధాన్యతను పెంచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కంటోన్మెంట్ కాంగ్రెస్ బీసీ నాయకులు అన్నారు. ఈక్రమంలో బీసీ కులగణన విజయవంతంగా పూర్తిచేసి అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు వద్ద మార్కెట్ యార్డు చైర్మన్ రాగిరు ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటోన్మెంట్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా చైర్మన్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. బీసీల హక్కుల గౌరవాన్ని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో బీసీల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నా రు. బీసీల హక్కులు పరిరక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం భవిష్యత్తు తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దేవేందర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మార్కెట్ యార్డు పాలక మండలి సభ్యులు ప్రభాకర్, సాయిశరత్, సంతు, నల్లాల రాజేందర్, కృష్ణారెడ్డి, దుర్గేష్ గౌడ్, ఆకాష్‌రెడ్డి, పాషా, జూలియస్ బీసీ నాయకులు బద్రినాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, పెద్దాల నర్సింహ, ముఖేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌నని నమ్మించి యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అమీర్‌పేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాను పోలీస్ కానిస్టేబుల్‌నని, ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నానని బీటెక్ చదివే యువతిని నమ్మించిన వ్యక్తి ఆమె ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లను తీసుకుని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. తాను చెప్పినట్లు వినకుంటే ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్ చేసి బంధువులకు పంపిస్తానని చెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన యువతి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువతి (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఏడాది క్రితం ఓ పార్క్‌కు వెళ్లినప్పుడు తేమలి పుజారా రమేష్(24) అనే యువకుడు పరిచయమయ్యాడు. తాను పోలీస్ కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత ఆమె ఫోన్‌లోని నంబర్లను తన ఫోన్‌లోకి మార్చుకుని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుంటే అతడు నిజంగానే కానిస్టేబులేనా అనే విషయం తెలుస్తుందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

కంటోన్మెంట్ అభివృద్ధే ధ్యేయం



డ్రైనేజీ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, భానుక నర్మదా మల్లికార్జున్

మారేడుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అభివృద్ధి ధ్యేయంగా పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం పికెట్‌లోని హరిజన బస్తీలో రూ. 15.3లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ఒక్కో సమస్యను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇప్పటికే ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించామని, వాటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, స్థానిక వాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

తార్నాక, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా లాలాపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య కంటి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్ష చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా కళ్ల అద్దాలు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టితో ఉంచుకొని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఉచితంగా వైద్య కంటి పరీక్షలతో పాటు, కళ్ల అద్దాలు పంపిణీ చేస్తుందని ఆమె పేర్కొన్నారు.

కారు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

పంజాగుట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం వద్ద కారును దొంగిలించిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట్ లీలానగర్‌కు చెందిన తోట ప్రసాద్ ఈ నెల 16న కారు రోడ్డుపై పెట్టి మద్యం దుకాణానికి వెళ్లాడు. ఈ సమయంలో అమీర్‌పేట్ లాల్‌బంగ్లా ప్రాంతంలో నివసించే మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన దిగబర్ రఘునాథ్ ఖండేరే(29) కారును తీసుకెళ్లాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు.

ఇఫ్తార్‌కు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్‌కు వెళ్లి వచ్చే సరికి దుండగులు ఇంట్లో చోరీ చేశారు. విలువైన బంగారు ఆభరణాలు, స్వదేశీ, విదేశీ నగదు చోరీ చేశారు. షేక్‌పేట డైమండ్ హిల్ కాలనీకి చెందిన మహ్మద్ ముజాహిద్ కమల్ కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాలో ఉంటూ రెండు నెలల క్రితం తిరిగి వచ్చాడు. ఈ నెల 17న కుటుంబ సభ్యులతో కలిసి ఇఫ్తార్ కోసం బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున తిరిగి వచ్చే సరికి ఇంటి వెనుకవైపు తలుపు పగులకొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. అల్మారాలో ఉన్న 34 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.5 లక్షల నగదు, 550 కెనడియన్ డాలర్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి పోలీసులు ఆధారాలను సేకరించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న కంటోన్మెంటు అధికారులు

తిరుమలగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి గన్‌రక్ సమీపంలోని టీచర్స్ కాలనీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సీఈఓ ఆదేశాల మేరకు కంటోన్మెంటు అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఓ భవన యజమాని అనుమతి లేకుండా పెంట్‌హౌజ్‌ను నిర్మించారు. అధికారులు నోటీసులు జారీ చేసినా నిర్మాణం చేపట్టడంతో పలువురు ఫిర్యాదుల మేరకు కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కంటోన్మెంటు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు చేపడితే నిర్దాక్షంగా కూల్చి వేస్తామని హెచ్చరించారు. కూల్చివేతల్లో కంటోన్మెంటు బోర్డు ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బేగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై బైక్‌పై వచ్చిన దుండగులు కత్తితో దాడి చేసి పరారయ్యారు. చేతికి గాయం కావడంతో బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగవంతాపూర్‌లో గల గగన్‌విహార్ కాలనీలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటలోని భగవంతాపూర్‌లో నివసించే వెంకటేష్‌యాదవ్(35) ట్రాలీ ఆటో నడుపుతుంటాడు. మంగళవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆటో పార్క్ చేసి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగుల్లో ఒకరు కత్తితో దాడి చేశాడు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. దాడికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బోగస్ ఓట్ల తొలగింపునకు సహకరించండి

- సనత్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ సమ్మయ్య

సికింద్రాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నిర్దిష్టమైన ఫిర్యాదుతో వచ్చి, సరియైన ఆధారాలు చూపి, బోగస్ ఓట్ల తొలగింపునకు సహకరించాలని అఖిలపక్ష నాయకులకు సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ సమ్మయ్య సూచించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అఖిల పక్ష నాయకులతో మంగళవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో ఎలక్టోరల్‌పై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఓటర్ల నమోదు తీరుతెన్నులు, పోలింగ్ బూత్‌ల పరిస్థితి, ఎన్నికల నిర్వహణపై అఖిల పక్ష నాయకులతో విస్తృతంగా చర్చించారు. వారి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు నమోదు చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు పారదర్శకంగా జరపడంతోపాటు పోలింగ్ అత్యధిక శాతం జరగడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, అధికారులపై ఉందని అభిప్రాయపడ్డారు. చాలా చోట్ల కొందరు రెండు ఓట్లు కలిగి ఉన్నారని, అలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోండ మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ (బీజేపీ) కొంతం దీపిక మాట్లాడుతూ.. ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు పోలింగ్ బూత్‌ల జాబితాలో పేర్లు ఉంటున్నాయని, దీంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అటువంటి పొరపాట్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద నీటి సదుపాయం, టెంట్ వసతి, దివ్యాంగులకు వీల్‌చైర్ సదుపాయం తప్పకుండా ఉండేలా చూడాలని కోరారు. బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ మాట్లాడుతూ... బోగస్ ఓట్లు తొలగింపులో కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అఖిల పక్ష నాయకుల సూచనలు విన్న అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ ... బూత్ లెవల్ ఆఫీసర్లకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరిస్తే అటు ఓటింగ్ శాతం పెరగడంతోపాటు పోలింగ్ సక్రమంగా జరుగుతుందని, బోగస్ ఓట్ల ఏరివేత సునాయసం అవుతోందన్నారు.

అన్ని పార్టీలు ముందుకొచ్చి, ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కొక్కరి చొప్పున తమ నాయకుల పేర్లు ఇవ్వాలని, బూత్ లెవల్ ఆఫీసర్లతో వారిని సమన్వయం చేస్తామన్నారు. జాబితాలో పేర్కొన్నట్టు ఓటరు నివసించకపోతే. దీనికి సంబంధించిన ఆధారాలు, ఇంటి యజమాని సంతకం ఉంటే పేరు తొలగించడం సులభం అవుతుందని స్పష్టం చేశారు. ఇంటి యజమాని లేకుండా, కిరాయిదారులైతే.. అన్ని పార్టీల నాయకుల సమక్షంలో, బూత్ లెవల్ ఆఫీసర్ పంచనామ చేసి ఓటు తొలగించే వెసులుబాటు ఉందన్నారు. స్పష్టమైన ఆధారాలు లేకుండా పేరు తొలగిస్తే... ఓటరుకు జవాబు చెప్పడం క్లిష్టంగా మారుతుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు గంట సుధీర్, బాలరాజ్ బీఆర్ఎస్ నాయకుడు యాదవ్, టీడీపీ నాయకుడు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- కంటోన్మెంట్ అఖిలపక్ష నాయకుల వినతి

సికింద్రాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల గుర్తింపు కార్డుల జారీలో జాప్యాన్ని నివారించి, త్వరగా కార్డులు అందేలా చూడాలని అఖిల పక్ష నాయకులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎలక్టోరల్‌పై సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్ని పార్టీల నాయకులతో మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పలు సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేశారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేసుకున్న తర్వాత ఎన్నికల గుర్తింపు కార్డు రావడానికి నెలలు పడుతోందని, త్వరగా కార్డు వచ్చేలా చూడాలని వారు కోరారు.

ఆధార్‌తో ఓటర్ పేరును లింక్ చేయాలని, పోలింగ్ బూత్‌ల సంఖ్యను పెంచాలని వారు సూచించారు. మారేడుపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ నేపథ్యంలో అందులోంచి రెండు పోలింగ్ బూత్‌ను పాలిటెక్నిక్ కళాశాలకు మార్చారని, ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పోలింగ్ బూత్‌లను తిరిగి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు రప్పించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఏఈఆర్ఓ వెంకటరమణ, ఎన్నికల ఇన్‌చార్జి డీవీ శ్రీనివాస్, నాయకులు ధనంజయచారి, విజయానంద్ (బీజేపీ), కె.బాబూరావు (బీజేపీ), ఎస్.కే.బాబు (టీడీపీ), నర్సింగ్‌రావు (టీడీపీ), విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
జి.అంజయ్య: 9985921364